# ఈ వారం కథ




మా పక్కింటి లక్ష్మీ భక్తుడికి తల్లిదండ్రులు బొడ్డుకోసి పెట్టిన పేరేమైనా నేను పెట్టిన పేరు డాలర్‌రావు. నేనా పేరు పెట్టానని తెలిస్తే ఆయన ఉబ్బి తబ్బిబ్బైపోతాడని నా నమ్మకం.

ఆయన టీచరైనప్పటికీ సోదరుడి పేర సాగుతున్న షేర్ల వ్యాపారానికి సారథి. మరో చేత్తో వడ్డీ వ్యాపారం వెలగబెడ్తుంటాడు. ఇంకో రెండు చేతులున్నా సంపాదనకి చాలేవి కావు.

ఎప్పుడూ ఏదో కొత్త సంపాదనా మార్గాన్ని వెతుకుతూనే వుంటాడు. ఇళ్ళస్థలాలు అమ్ముతాడు, కొంటాడు. చౌకగా టౌన్లో మంచి ఇల్లు కట్టిస్తానని, రిజిస్ట్రేషన్ దగ్గరి నుంచి అన్ని పనులూ తానే స్వయంగా చూసుకుంటానని చెప్పి వేలకు వేలు కాజేశాడని కొందరు బంధువులంటారు. "ఈ పిసినారి ముండావాళ్ళకి అంతకంటే ఇంద్రభవనం ఎవరు కట్టించగలరు? చేతకాక కాళ్ళావేళ్ళాబడ్తే మన వాళ్ళు కదా అని సాయం చేశాను" అని గొంతు చించుకొంటాడు డాలర్‌రావు.

అధికారుల్ని మచ్చిక చేసుకుని బడి ఎగ్గొట్టి సొంత పనులు చక్కబెట్టుకొంటాడు. తరగతికి వెళ్ళినా కాలిక్యులేటర్ నొక్కుతూ కంపెనీల పరిస్థితుల్ని అంచనా వేస్తూనే వుంటాడు. పాఠం చెప్తున్నా డబ్బు గురించే పలవరిస్తాడు. "ఆర్కిమెడీస్ యురేకా యురేకా అని హుషారుగా పరిగెత్తాట్ట. ఎందుకు? ఒక కొత్త సంగతిని కనుగొన్నప్పుడు ఆనందం పట్టలేం. ఏ కంపెనీల షేర్లు కొంటే లాభం వస్తుందో, డబ్బు దండిగా వస్తుందో తెలుసుకున్నప్పుడు కూడా అంతే ఆనందం కలుగుతుంది" అదీ డాలర్‌రావు ధోరణి.

తెలుగు టీచరైనా తెలుగంటే ఒళ్ళు మంట. అసలు లాంగ్వేజెస్ గురించి మన తెలివితేటలు వినియోగించడం వేస్టు. అంతకన్నా ఈ ఆధునిక యుగంలో కంప్యూటర్ లాంగ్వేజెస్ నేర్చుకోవడమే నయమంటాడు. పిల్లవాడికి తెలుగు నేర్పుతున్న శ్రీమతిని "ఎందుకు వాణ్ణి అనవసరంగా చెడగొడ్తావ్. అంతకన్నా లెక్కలు నేర్పు" అని గదిమాడు.

తోటి ఉపాధ్యాయుడు రాసిన కవిత్వం చదివి పెదవి విరిచాడు. "ఈ సింబల్సూ గాడిద గుడ్డూ శుద్ధ దండగ. డైరెక్టుగా చెప్పేడవచ్చుకదా. ఐనా అంత ఆవేశం ఎందుకండీ. వయసులో ఎవరైనా ఇలాగే వుంటారు. తర్వాత చల్లబడిపోతారు. ఐనా ఈ దరిద్రాలూ, కష్టాలూ కవిత్వంలో కూడా ఎందుకండీ, చేతకానివాళ్ళకే దరిద్రం. మీరు సినిమా పాటలు రాసి రెండు చేతులా సంపాదించచ్చు కదా"

డాలర్‌రావు డబ్బు మనిషని బంధువులంటారు. కాని అతడు ఎన్ని విధాలుగా డబ్బు సంపాదిస్తాడో, ఎలా అంచెలంచెలుగా ఎదిగిపోతున్నాడో చెప్తాకాని ఈర్ష్యపడడం కన్నా వాళ్ళకిష్టమైనది మరేదీ లేదు. డాలర్ రావు అద్భుతమైన ఇల్లు కట్టి గృహప్రవేశానికి ధనవంతులు ఆస్తిపరులైన బంధువుల్ని ఆదరంగా, శ్రద్ధగా పిలిచాడు. "ఎంత ఎత్తు ఎదిగిపోయావయ్యా. మగాడివంటే నువ్వు" అని మెచ్చుకున్నారు వాళ్ళు. అదే అతడు కోరుకున్నది. అంతేకాక చదివింపులు కూడా బాగానే వచ్చాయి. ఎన్నో గోల్డ్ మెడల్స్ పురస్కారాలూ పొందిన ఒక విద్యాధికుడు కూడా నిరాశగా మూల్గాడు. "వెధవ చదువులు ఏం ప్రయోజనం? ఇంత చదివి ఏం సాధించా నేను? ఈయన్ని చూడండి చూస్తూండగా ఎంత ఎదిగిపోయాడో."

ఆయన పొద్దుట లేచిన వెంటనే షేర్ పత్రికలే ముందు చూస్తాడు. "షేర్ మార్కెట్టంటే జూదం కదా?" అన్నాను నేను.

"కాదు. తెలివిగా ఫాలో అయితే కోట్లు సంపాదించచ్చు. అయినా పేకాటకి కూడా తెలివి కావాలి కదండీ" అన్నాడు. ఆ తెలివి ఏ కంపెనీలో దొరుకుతుందో, దాని ధర ఎంతో? ఆయన షేర్ మార్కెట్ కళ్ళద్దాల్లోంచే చూస్తాడు. "బొంబాయిలో ఎంత ఘోరం?" అన్నాను.

"ఔను షేర్ మార్కెట్ దెబ్బతింటుంది."

డాలర్‌రావు తర్కం తిరుగులేని తర్కం. "చూడండి. హర్షద్ మెహతా చేసిన తప్పేముంది? వ్యవస్థలోని లొసుగుల్ని అందరూ ఉపయోగించుకుంటున్నారు. ఆయన మరింత తెలివిగా ఉపయోగించుకొన్నాడంతే. మీరు చేతకాక నీతులు చెప్తారు. అసలు షేర్ మార్కెట్‌ని హర్షద్ మెహతాలా ప్రోగ్రెస్‌లోకి తీసుకెళ్ళగల వాళ్ళెవరున్నారు? అందుకే ఆయన్ని దేవుళ్ళా పూజించే వాళ్ళెందరో వున్నారు."

డాలర్లతో కాక దిక్కుమాలిన రూపాయల్తో బతకవలసి వచ్చినందుకు సిగ్గుపడుతున్నట్టుంటాడు డాలర్‌రావు. "నేను అమెరికా వెళ్ళాలని కలగనేవాణ్ణి. నా వల్ల కాలేదు. కనీసం మా అబ్బాయైనా వెళ్తాడని ఆశ. ఇండియాలో ప్రతిభకి గౌరవం ఏముంది? మా బాబయ్య అమెరికాలో స్థిరపడ్డాడు. బాగా సంపాదించాడు. ఈనాడు మన దేశానికి ఫారెన్ కరెన్సీ కొరత కదా. అలాంటివాళ్ళే మన దేశాన్ని గట్టెక్కించాలి" అన్నాడు. "మారుతీకార్లలాంటి అనవసరమైన విలాస వస్తువుల ఉత్పత్తి కోసం చేసుకున్న దిగుమతుల వల్ల, విలాస వస్తువుల దిగుమతుల వల్ల ఈ కొరత వచ్చింది కదా" అని నేను ప్రశ్నించాను. "మీరు కమ్యూనిస్టుల్లా వున్నారు. ఏది అవసరం, ఏదనవసరం? కొనేవాళ్ళని బట్టి తయారుచేస్తారు. కొనగలిగినవాళ్ళు ధనవంతులే కదా? ఈ కమ్యూనిస్టు కాకమ్మ కబుర్లు చెప్తూ కూర్చునే కన్నా, మీరు కూడా మారుతీకారు కొనే స్థితికి ఎదగచ్చు కదా?" నాకీ డొక్కు సైకిలు తప్పదు కాని, డాలర్ రావుకి మారుతీ వాహనయోగం వుందని ఎవరైనా చెప్పగలరు.

"బడ్జెట్ చాలా బాగుందండీ. కాస్మొటిక్స్, కలర్ టీవీ, ఫ్రిజ్‌లూ, మారుతీ కార్లపై సుంకం తగ్గించేశారు" అన్నాడు. "సామాన్యుడి సంగతో" అని మూల్గాను. "సామాన్యుడెప్పుడూ ఈ వ్యవస్థలో అప్రధానమే. వాడి చుట్టూ ప్రపంచం తిరగదు. సోవియట్ ముక్కలైనా ఈ పాత చింతకాయ పచ్చడి కబుర్లెందుకండీ" బాపురే మన్మోహనసింహుడైనా ఈ డాలర్ సింహుడి ముందు నిలవగలడా?


అవు, సొంత గొడవే పరమార్థమనుకునే వాడి గురించి చెప్పేదేముంది అనద్దు. సొంత గొడవ బాగా చూసుకునే నలుగురైదుగురి గురించి తెలుసుకుంటే మన ఇల్లు మనం చక్కబెట్టుకోవచ్చు కదా. అదీకాక మా డాలర్ రావుకి భారతీయ సంస్కృతి అన్నా, వేదాంతమన్నా చచ్చేంత ఇష్టం. దేవుణ్ణి ఏ రూపంలోనైనా కొలవచ్చంటారు. డాలర్‌రావుకి డబ్బే దైవం. "ధర్మార్థ కామ మోక్షాలని నాలుగు పురుషార్థాల గురించి మనవాళ్ళు చెప్పారు కదండీ. అర్థం (డబ్బు) లేకుండా మరేదీ లేదు. సన్యాసులైనా డబ్బున్నవాళ్ల భక్తివల్లనే కదా బతికేది" అంటాడాయన.

ఒక రోజు డాలర్‌రావు గుడిలో భగవద్గీతపై ఉపన్యాసం చెప్తున్నానని చెప్పాడు. మేధావులెందరో భగవద్గీతకి నానా రకాల వ్యాఖ్యానాలెన్నో చిత్తం వచ్చినట్టు రాసిపారేశారు. మా షేర్ వేదాంతి కొత్త వ్యాఖ్యానం జేరిస్తే తప్పేముంది?

షేర్ వేదాంతి ఉపన్యాసం మొదలుపెట్టాడు. "షేర్ మార్కెట్‌ని అర్థంచేసుకుంటే భగవంతుడి జగన్నాటకం మొత్తం అర్థమైపోతుంది. డబ్బు మిథ్య, డబ్బు చలనం మిథ్య, దాని పెరుగుదల మిథ్య అని బొంబాయి షేర్ మార్కెట్టులో నిర్ధారణ అయిపోయింది కదా! ఈ ప్రపంచం పుట్టుక, పెరుగుదల అంతా మిథ్య. దీన్నే మాయ అంటారు. షేర్ వ్యాపారం వలన ఎందరో దివాళా తీశారు. కొందరు కోటికి పడగలెత్తారు. అదంతా వారి పూర్వజన్మ కర్మ ఫలితం.

ఇంతలో పక్కనే మరో మీటింగు. దారి పక్క పడున్న పాత చెప్పులు వేసుకున్నందుకు కూలి చేసుకుని బతికే స్త్రీని కొట్టి చంపాడొక కుల దురహంకారి. ఆ దౌర్జన్యాన్ని నిరసిస్తూ నినాదాలూ ఆగ్రహ ఉపన్యాసాలూ మా వేదాంతపు మత్తుని చెదరగొడ్తున్నాయి. మా షేర్ వేదాంతి ఉపన్యాసాన్ని శ్రద్ధగా వింటున్న ఒక పెద్దమనిషి మూలుగుతున్నాడు. "ఎందుకలా గొంతు చించుకుంటున్నారు? ఎంతో కొంత నష్ట పరిహారం ఇస్తామన్నార్ట. నోర్మూసుకుని వూరుకోవచ్చు గదా? అయినా ఎవరైనా వూరికే చంపుతారా? గుడికి వచ్చి హాయిగా ప్రశాంతంగా వేదాంతం విందామనుకుంటే ఏమిటీ కాకిగోల?"

ఆ కాకి గోలకు మా షేర్ కోకిల గొంతు మూగబోయింది. "దళిత పులులమ్మ" అని డప్పుల చప్పుడు. స్టేజీ దిగి వెళ్ళిపోయాడు మా వేదాంతి మూల్గుతూ. "ఛ్ఛ డర్టీ ఇండియన్స్‌లో స్థిరిచ్యువాల్టీ పోయింది. అమెరికాలోనైతే... ..."



## అగ్గిపుల్లలే అతడి కళాసామగ్రి

అమెరికాలో అయోలా రాష్ట్రంలోని మార్షల్ టౌన్‌లో 31 ఏళ్ళ పేట్ ఏక్టన్ దొరగారికి చిత్రమైన హాబీ ఒకటుంది. మాంచి వాటంగా వుండే అగ్గిపుల్లలను తీసుకుని అదరహో అనిపించే రీతిలో రైళ్ళు, విమానాలు, జీవకళ ఉట్టిపడే కళాఖండాలు తయారుచేస్తాడీయన. వారానికి 30 గంటలపాటు తన హాబీ కోసం ఆయన పనిచేస్తాడు. ఈ చిత్రంలో వున్న రైలింజన్ తయారీకి 75 వేల అగ్గిపుల్లలు, రెక్కలు విప్పుకున్న గ్రద్ద బొమ్మకు 17 వేల అగ్గిపుల్లలు, మోడ్రన్ విమానానికి 13 వేల అగ్గిపుల్లలు, రైట్ బ్రదర్స్ ఎగిరిన తొలినాటి విమానం మోడల్‌కు 15 వేల అగ్గిపుల్లలు పట్టాయట. 56 అడుగుల తుపాకి వీరుడు బొమ్మను 27 వేల అగ్గిపులలతో ఆయన తయారు చేశాడు. ఇవన్నీ చేయడానికి ఏక్టన్ దొరకు 400 గంటల సమయం పట్టిందట.

—ఎం.ఊహ